RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in    rajadhanivoicedaily@gmail.com

RAJADHANI VOICE రాజధాని వాయిస్ TELUGU DAILY

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కోనసాగుటకు
గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు
నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు
మండలాల వారిగా విలేఖరులు కావవలెను
ఆసక్తి గలవారు సంప్రదించగలరు.
9030343195
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 02 | సంచిక : 270 | 22 శనివారం ఆగష్టు 2026 | ఎడిటర్ : పొగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

### రాయదుర్గం భూముల

## వేలానికి గ్రీన్ సిగ్నల్

వేలం నిలిపివేయాలన్న పిటిషన్ తిరస్కరణ
అభ్యంతరాలుంటే హైకోర్టును ఆశ్రయించాలన్న సూచన
ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం



**రాజధాని వాయిస్ న్యూఢిల్లీ, ఆగస్టు 21:** తెలంగాణలోని రాయ దుర్గం పాన్ మక్తా భూముల వేలం ప్రక్రియలో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. వేలం ప్రక్రియను నిలిపివేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ, ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత పక్షాలు హైకోర్టును ఆశ్రయించాలని స్పష్టం చేసింది. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ రాయదుర్గం పాన్ మక్తాలోని సుమారు 11 ఎకరాల భూమిని వేలం వేయడానికి ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ భూమికి ఎకరాకు కనీస ధరను రూ.175 కోట్లుగా ▶▶2

## వైకాపా ఎంపీ అవినాష్ నివాసంలో రూ.24లక్షల నగదు సీజ్

**రాజధాని వాయిస్ హైదరాబాద్, ఆగస్టు 21 :** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు ముగిశాయి. సీబీఐ కేసు ఆధారంగా హైదరాబాద్, కడప సహా ఏడు చోట్ల ఈడీ తనిఖీలు చేపట్టింది. ఈ కేసులోని కీలక నిందితుల నివాసాల్లో సోదాలు జరిగాయి. పలు పత్రాలు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. వైకాపా ఎంపీ అవినాష్ రెడ్డి నివాసాల్లోనూ ఈడీ అధికారులు తనిఖీలు చేశారు. అవినాష్ నివాసంలో లెక్క చూపని రూ.24లక్షల నగదును సీజ్ చేశారు. ఆయనకు చెందిన రెండు లాకర్ల తాళాలను స్వాధీనం చేసుకు న్నారు. సోదాల్లో లభించిన డిజిటల్, ఆర్థిక ఆధారాలపై ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది.

## సాదిక్ ఖాన్ దొరికాడు!

ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసు.. సాదిక్ ఖాన్ దొరికాడు!
ఏఈ కుటుంబాన్ని ఆత్మహత్యకు ప్రేరేపించిన షూటింగ్ కోచ్
భర్తను విషమిచ్చి చంపాడని భార్య సూసైడ్ నోట్
ప్రైవేట్ ఫొటోలతో బ్లాక్‌మెయిల్, ఆస్తుల కోసం వేధింపులు
పరారీలో ఉన్న నిందితుడు షేక్ సాదిక్ ఖాన్
ఐదు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్న పోలీసులు



**రాజధాని వాయిస్ కాకినాడ,** రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన కాకినాడ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రైఫిల్ షూటింగ్ కోచ్ షేక్ సాదిక్ ఖాన్‌ను కాకినాడ జిల్లా పోలీసులు ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నారు. కొన్ని రోజులుగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న అతడిని ఎట్టకేలకు పట్టుకున్నారు. అయితే ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచుతున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం సాదిక్ ఖాన్‌ను కాకినాడకు తరలిస్తున్నట్టు సమాచారం.

**అసలేం జరిగిందంటే..**

పంచాయతీ రాజ్ శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న టిల్లాపూడి నూకరాజు, ఆయన భార్య, కుమార్తెతో కలిసి ఈ నెల 16న రాజమహేంద్రవరం వద్ద గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆత్మహత్యకు ముందు వారు రాసిన సూసైడ్ నోట్‌లో తమ చావుకు కోచ్ సాదిక్ ఖాన్ వేధింపులే కారణమని స్పష్టంగా పేర్కొన్నారు. తన కుమార్తె సౌజన్యను లోబరుచుకునేందుకు ప్రయత్నించాడని, ముస్లిం మతంలోకి మారాలని ఒత్తిడి చేశాడని, తమ కుటుంబంపై తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేశాడని నూకరాజు ఆ లేఖలో ఆరోపించారు. ఈ ఘటన తర్వాత పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా, నూకరాజు, ఆయన కుమార్తె సౌజన్య మృతదేహాలు లభ్యమయ్యాయి. ఆయన భార్య మీనా మృతదేహం కోసం గాలింపు ఇంకా కొనసాగుతోంది. మనవడు ఎలాగోలా ఈదుకుంటూ బయటపడ్డాడు.

**ఐదు బృందాలతో గాలింపు..**

నూకరాజు కుటుంబం ఆత్మహత్య చేసుకున్న నాటి నుంచి సాదిక్ ఖాన్ పరారీలో ఉన్నాడు. అతడిని పట్టుకునేందుకు కాకినాడ జిల్లా పోలీసులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఢిల్లీ, ముంబై నగరాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టారు. పోలీసులను తప్పించుకునేందుకు సాదిక్ ఖాన్ తన సెల్ ఫోన్‌ను ఉపయోగించకుండా, వేర్వేరు ప్రాంతాలకు మారుతూ జాగ్రత్తలు తీసుకున్నాడు. అయినప్పటికీ, సాంకేతిక ఆధారాలతో అతడి కదలికలను గుర్తించిన పోలీసులు ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నారు.

**వివరాల్లోకి వెళితే..**

ఏఈ నూకరాజు మనవడు, కాకినాడలో సాదిక్ ఖాన్ నడుపుతున్న షూటింగ్ అకాడమీలో చేరాడు. దీన్ని అదనుగా చేసుకున్న సాదిక్, నూకరాజు కుటుంబంతో పరిచయం పెంచుకున్నాడు. ముఖ్యంగా, నూకరాజు కుమార్తె సౌజన్యకు మాటలతో వల వేసి, ఆమెను పూర్తిగా తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. క్రమంగా ఆ ఇంటిపై పట్టు సాధించి, ఇంట్లో ఉన్న బంగారం, నగదు, ఏటీఎం కార్డులను కూడా తన నియంత్రణలోకి తీసుకున్నాడు. సాదిక్ ఖాన్ పెట్టిన తీవ్ర మానసిక హింసను తట్టుకోలేక నూకరాజు కుటుంబం గోదావరి నదిలో దూకింది. అయితే, సౌజన్య భర్త జగదీశ్వర్ రెడ్డి జూలై 2న మరణించడంతో ఈ వ్యవహారం మరో మలుపు తిరిగింది. జగదీశ్వర్ రెడ్డి మృతిపై అతని తండ్రి భాస్కర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న సౌజన్య రాసిన లేఖలో పలు సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తన భర్త జగదీశ్వర్ రెడ్డికి సాదిక్ ఖాన్ విషపూరిత పదార్థం ఇచ్చి చంపాడని ఆమె ఆరోపించిం ది. తన ప్రైవేట్ ఫొటోలను అడ్డం పెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని, ఆస్తుల కోసం తనతో పాటు తన తండ్రి నూకరాజును కూడా చంపేస్తానని బెదిరిం చాడని లేఖలో పేర్కొంది. అంతేకాకుండా, ఇస్లాం మతంలోకి మారాలని తనపై ఒత్తిడి తెచ్చాడని కూడా ఆమె ఆరోపించింది. భాస్కర్ రెడ్డి ఫిర్యాదు మేరకు సర్పవరం పోలీసులు ▶▶2

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- అన్నదాతలకు విస్తృత ఆర్థిక సహాయం
- వ్యవసాయ రంగంలో సంస్కరణల అమలు
- రైతును రాజుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి



**రాజధాని వాయిస్ అమరావతి:** రాష్ట్ర జనాభాలో అధిక శాతం మంది వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్న నేపథ్యంలో రైతుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రైతులకు ప్రతి దశలో అండగా నిలవడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. శాసనసభలో వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై ఆయన సమగ్ర వివరాలు వెల్లడించారు. అన్నదాత సుఖీభవ -- పీఎం కిసాన్ పథకాల ద్వారా రాష్ట్రంలోని రైతులకు భారీ స్థాయిలో ఆర్థిక సాయం అందించినట్లు మంత్రి వివరించారు. ఇప్పటివరకు దాదా పు 47 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.14,664.33 కోట్లను నేరుగా ▶▶2

## షావుకారు జానకి మృతికి చంద్రబాబు సంతాపం

**తెలుగు సినీ రంగానికి తీరని లోటు**
**ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి**
**నాలుగు వందలకుపైగా చిత్రాల్లో నటన**
**కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి**



**రాజధాని వాయిస్ అమరావతి, ఆగస్టు 21 :** ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి మరణం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 94 ఏళ్ల వయసులో ఆమె కన్నుమూయడం తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటని పేర్కొన్నా రు. దశాబ్దాల పాటు తన నటనతో ప్రేక్షకులను అలరించిన షావుకారు జానకి భౌతికంగా దూరమైనప్పటికీ ఆమె పోషించిన పాత్రలు ఎప్పటికీ ప్రజల హృదయాల్లో నిలిచి ఉంటాయని అన్నారు. షావుకారు జానకి భారతీయ సినీ రంగంలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్నారని చంద్రబాబు గుర్తుచేశారు. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో నాలుగు వందలకుపైగా చిత్రాల్లో నటించి ప్రేక్షకుల అభిమానాన్ని పొందారని పేర్కొన్నారు. కథానాయికగా మాత్రమే కాకుండా విభిన్న పాత్రల్లోనూ అద్భుత నటన కనబర్చి తరతరాల ప్రేక్షకులను ఆకట్టుకున్నారని కొనియాడారు. సుదీర్ఘ సినీ ప్రస్థానంలో ఆమె ▶▶2

## ఈ నెల 29 నుంచి సీడ్ యాక్సెస్ రహదారి మూడో దశ పనులు: మంత్రి నారాయణ



**రాజధాని వాయిస్ అమరావతి, ఆగస్టు 21 :** రాజధానిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన సీడ్ యాక్సెస్ రహదారి మూడో దశ పనులను ఈనెల 29 నుంచి ప్రారంభిస్తామని మంత్రి నారాయణ చెప్పారు. గుంటూరు జిల్లా తుళ్లూరు లోని శ్రీరామలింగేశ్వర స్వామి, శ్రీబాలకోటేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్స వంలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ... ఈ ఆలయం నుంచి రైతులు ప్రారంభించిన పాదయాత్ర విజయవంతంగా జరిగిందని చెప్పారు. రాజధాని నిర్మాణంలో భాగంగా ప్రస్తుతం ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వే లైన్ నిర్మాణంపై దృష్టి సారించామని.. ఆ తర్వాత విమానాశ్రయం నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి చెప్పారు. ఇకపై ప్రతినెలా ఒక్కో టవర్ నిర్మాణం పూర్తి చేస్తామని వెల్లడించారు. రైతుల ప్లాట్ల అభివృద్ధి కోసం ఈనెల 27న టెండర్లు ఓపెన్ చేస్తున్నామని, ఆ తర్వాత వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.

## పెల్లెట్ ఘటనపై రాహుల్ ధర్నా

▶▶ పోలీసు స్టేషన్‌లో కాంగ్రెస్ ఆందోళన
▶▶ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్
▶▶ బాధితుడితో కలిసి ఫిర్యాదు ప్రయత్నం




**రాజధాని వాయిస్ న్యూఢిల్లీ, ఆగస్టు 21 :** జూలై 20న జరిగిన నిరసన కార్యక్రమం సందర్భంగా పెల్లెట్ గాయాల ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌లో ధర్నాకు దిగారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఆందోళనకారులపై పెల్లెట్ గన్స్ ఉపయోగించారని ఆరోపిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ పార్లమెంట్ స్ట్రీట్ ▶▶2

## అంతరిక్ష రంగ స్టార్టప్‌లతో మోదీ భేటీ

▶▶ యువ పారిశ్రామికవేత్తల కృషిని ప్రశంసించిన ప్రధాని
▶▶ అంతరిక్ష సంస్కరణలతో కొత్త అవకాశాలు
▶▶ స్టార్టప్‌లకు కేంద్రం పూర్తి మద్దతు



**రాజధాని వాయిస్ న్యూఢిల్లీ, ఆగస్టు 21 :** దేశ అంతరిక్ష రంగంలో ముందుకు వస్తున్న యువ పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలతో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. భారత అంతరిక్ష రంగానికి కొత్త ఊపును తీసుకొస్తున్న యువశక్తి కృషిని కొనియాడుతూ, భవిష్యత్తులో కూడా కేంద్ర ప్రభుత్వం వారికి పూర్తి మద్దతుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. అంతరిక్ష రంగంలో అడుగుపెట్టడం సవాళ్లతో కూడుకున్న విషయమని, అయినప్పటికీ యువ పారిశ్రామికవేత్తలు ధైర్యంగా ముందుకు వచ్చి తమ సామర్థ్యాన్ని నిరూపించుకున్నారని ప్రధాని పేర్కొ న్నారు. సంస్కరణలపై విశ్వాసం ఉంచి, నిరంతర కృషితో ముందుకు సాగినందువల్లే గత కొన్ని ▶▶2

## పుణెలో డిజిటల్ బ్రిక్స్ ఫోరం నిర్వహణ

– డిజిటల్ సహకారంపై అంతర్జాతీయ చర్చలు
– జ్యోతిరాదిత్య సింధియా ప్రారంభోపన్యాసం
– పెమ్మసాని చంద్రశేఖర్ కీలక వ్యాఖ్యలు
– సురక్షిత డిజిటల్ వ్యవస్థలపై దృష్టి




**రాజధాని వాయిస్ పుణె,  :** బ్రిక్స్ దేశాల మధ్య డిజిటల్ రంగ సహకారాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో పుణెలో డిజిటల్ బ్రిక్స్ ఫోరం మరియు ఎక్స్‌పో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ్య దేశాల ప్రభుత్వ ప్రతినిధులు, పరిశ్రమల నాయకులు, విద్యాసంస్థలు, స్టార్టప్ సంస్థలు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సమగ్ర, సురక్షిత, స్థిరమైన డిజిటల్ వ్యవస్థల నిర్మాణంపై విస్తృత చర్చలు జరిపారు. డిజిటల్ యుగంలో సాంకేతికత అభివృద్ధి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు కీలకంగా మారిందని పాల్గొన్న ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. డిజిటల్ మౌలిక వసతుల విస్తరణ, కృత్రిమ మేధస్సు, సైబర్ భద్రత, డేటా పరిరక్షణ వంటి అంశాలపై సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు డిజిటల్ సాంకేతికతలను మరింత చేరువ చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య ▶▶2

## విరమణ పొందిన అధికారులకు ఘన వీడ్కోలు

### వాయుసేనాధిపతితో ప్రత్యేక సమావేశం
### జాతీయ యుద్ధ స్మారకానికి నివాళులు
### సేవలను ప్రశంసించిన ఎయిర్ చీఫ్ మార్షల్
### దేశసేవలో నిలిచిన విశిష్ట వారసత్వం



**రాజధాని వాయిస్ న్యూఢిల్లీ:** భారత వాయుసేనలో విశిష్ట సేవలు అందించి విరమణ పొందుతున్న అధికారులకు వాయుసే నాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ ఘనంగా వీడ్కోలు పలికారు. ఆగస్టు 20న నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన అధికారులతో సమావేశమై వారి సేవలను కొనియాడారు. దేశ రక్షణలో, వాయుసేన అభివృద్ధిలో వారు అందించిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. విరమణ పొందుతున్న అధికారులు తమ సేవా కాలంలో ప్రదర్శించిన నిబద్ధత, క్రమశిక్షణ, ధైర్యసాహసాలు భారత వాయుసేనకు గర్వకారణమని ఎయిర్ చీఫ్ మార్షల్ తెలిపారు. దేశ భద్రత కోసం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ అత్యున్నత ప్రమాణాలతో విధులు నిర్వర్తించినం దుకు వారికి అభినందనలు తెలిపారు. వాయుసేన విలువలను నిలబెట్టడంలో వారి పాత్ర కీలకమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా అధికారులు న్యూఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకాన్ని సందర్శించి దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులు అర్పించారు. సైనికుల త్యాగాలు దేశానికి శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొంటూ మౌనంగా నివాళి ఘటించారు. దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వీరుల సేవలను స్మరించుకున్నారు. విరమణ అనంతరం జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతున్న అధికారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి అనుభవం సమాజానికి మరింత ఉపయోగపడాలని ఎయిర్ చీఫ్ మార్షల్ ఆకాంక్షించారు. దేశసేవలో సంపాదించిన విలువలు, నాయకత్వ లక్షణాలు భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు.భారత వాయుసేనలో సేవలందించిన ప్రతి అధికారి దేశ నిర్మాణంలో భాగస్వామిగా నిలుస్తారని అధికారులు పేర్కొన్నారు. వారి కృషి వల్లే వాయుసేన ప్రపంచంలో అత్యుత్తమ వైమానిక దళాల్లో ఒకటిగా ఎదిగిందని తెలిపారు. విధి నిర్వహణలో చూపిన అంకితభావం యువ అధికారులకు ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. విరమణ పొందిన ఈ అధికారులు తమ వెనుక విశిష్ట సేవల వారసత్వాన్ని వదిలి వెళ్తున్నారని వాయుసేన పేర్కొంది. దేశభక్తి, నిజాయితీ, కర్తవ్యనిష్ఠ, త్యాగస్ఫూర్తి వంటి విలువలతో వారు నిర్మించిన ప్రస్థానం భారత వాయుసేన చరిత్రలో చిరస్థాయి గా నిలిచిపోతుందని వెల్లడించింది. వారి భవిష్యత్తు జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించింది.

## ఉయ్యూరులో డయేరియాపై అసత్య ప్రచారం.. బాధితుల ఆరోగ్యం నిలకడగా ఉంది: మంత్రి నారాయణ

**రాజధాని వాయిస్ ఉయ్యూరు** :కృష్ణా జిల్లా ఉయ్యూరులో డయేరియా విస్తరిస్తోందంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని, కొందరు కావాలనే అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మంత్రి నారాయణ మండిపడ్డారు. ఉయ్యూరు ప్రభుత్వ ఆసు పత్రిలోని డయేరియా బాధితులను ఆయన ఈరోజు పరామ ర్శించారు. స్థానిక 5వ వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుతం ఆసుపత్రిలో 9 మంది చికిత్స పొందుతున్నారని, బాధితులందరి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉందని తెలిపారు.ఆగస్టు 17న మృతి చెందిన ఒక వ్యక్తి గు ండెపోటు కారణంగానే కన్నుమూశారని, ఆ మరణానికి డయేరియాకు ఎలాంటి సంబంధం లేదని మంత్రి తేల్చిచెప్పారు. ప్రాథమిక నీటి పరీక్షల నివేదిక ప్రకారం తాగునీటిలో ఎలాంటి బ్యాక్టీరియా లేదని వెల్లడైందన్నారు. సమస్య కు కారణం మున్సిపల్ పైప్‌లైన్లా లేక ప్రైవేట్ ఆర్వో ప్లాంట్లా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉందని వివరించారు.అమృత్ 2.0 పథకంలో భాగంగా రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో పాత పైప్‌లైన్లను మారుస్తున్నామని, భాగంగా ఉయ్యూరులో రూ. 98 కోట్లతో పనులు చేపడుతున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

## పల్లె సమస్యల పరిష్కారానికి పొన్నం భరోసా

**రాజధాని వాయిస్ చంతయ్యపల్లి** : హుస్నాబాద్ నియోజకవర్గం లోని భీమదేవరపల్లి మండలం చంతయ్యపల్లిలో నిర్వహించిన "పల్లె పల్లెకు పొన్నం అన్న -- పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలు, అవసరాలను తెలుసుకు న్నారు. గ్రామ ప్రజలు అందించిన వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజల వద్దకే ప్రభుత్వం వెళ్లి సమస్యలను తెలుసుకోవడం ప్రజాపా లనలో కీలక భాగమని ఆయన పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక వసతుల పరిస్థితి, సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై మంత్రి సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. గ్రామ ప్రజలు రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, సాగునీరు వంటి అంశాలపై తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి సమస్యను నమోదు చేసి, ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావాలన్నదే తమ లక్ష్యమని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా గౌరవెల్లి ప్రాజెక్టు పనులపై కూడా మంత్రి స్పందించారు. ప్రాజెక్టును పూర్తిచేసి కాలువల ద్వారా రైతులకు సాగునీరు అందించేలా చర్యలు వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు. సాగునీటి లభ్యత పెరగడం ద్వారా రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని, వ్యవసా య ఉత్పత్తి కూడా పెరుగుతుందని అన్నారు. రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. చంతయ్యపల్లి స్టేజి నుంచి గ్రామం వరకు ఉన్న రహదారిని నెల రోజుల వ్యవధిలో పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధికి రవాణా సదుపాయాలు కీలకమని పేర్కొంటూ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అలాగే గ్రామంలో సీసీ రోడ్లు, పంచాయతీ భవనం అభివృద్ధి, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

జమ చేసినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.8,903.10 కోట్లు, కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ.5,761.23 కోట్లు రైతులకు అందినట్లు వెల్లడించారు. రైతుల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడంలో ఈ పథకాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత తీసుకురావడానికి ఏపీ ఏఐఎంఎస్ 2.0 విధానాన్ని అమలు చేస్తున్నామని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా 15.69 లక్షల మంది రైతులు, 3.20 లక్షల మంది కౌలు రైతులకు శాస్త్రీయంగా ఎరువులు అందించినట్లు తెలిపారు. అక్రమాలకు తావులేకుండా ఆధునిక సాంకేతికతతో వ్యవస్థను బలోపేతం చేశామని చెప్పారు. రాబోయే అక్టోబర్ నెల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 9.20 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను ముందుగానే సిద్ధం చేసినట్లు వెల్లడించారు. పంటల ధరలు తగ్గినప్పుడు రైతులు నష్టపోకుండా మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం ద్వారా గత రెండేళ్లలో దాదాపు రూ.800 కోట్ల సాయం అందించినట్లు మంత్రి తెలిపారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు లభించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. అంతేకాకుండా పంటల బీమా నమోదు గడువును ఈ నెలాఖరు వరకు పొడిగించి రైతులకు మరింత అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. స్వల్ప ప్రీమియంతోనే బీమా సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు.రాష్ట్రంలో సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందని అచ్చెన్నాయుడు తెలిపారు. దాదాపు 50 లక్షల ఎకరాల్లో సేంద్రీయ సాగును విస్తరించడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచే విధంగా కొత్త వ్యవసాయ విధానాలను అమలు చేస్తున్నామని చెప్పారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రైతులను నిర్లక్ష్యం చేశారని ఆరోపించిన మంత్రి, ప్రస్తుతం ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పెట్టుబడి సాయం నుంచి పంటల బీమా వరకు, విత్తనం నుంచి ఎరువుల పంపిణీ వరకు ప్రతి దశలోనూ రైతుకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. రైతును రాజుగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ నిబద్ధత అని స్పష్టం చేస్తూ, వ్యవసాయాభివృద్ధి ద్వారానే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## షావుకారు జానకి మృతికి చంద్రబాబు సంతాపం

ఎన్నో అవార్డులు, పురస్కారాలు అందుకున్నారని ముఖ్యమంత్రి తెలిపారు. నటన పట్ల అంకితభావం, కళాప్రతిభతో ప్రత్యేక గుర్తింపు పొందిన ఆమె భారతీయ చలనచిత్ర రంగానికి విశేష సేవలు అందించారని అన్నారు. ఆమె నటించిన అనేక చిత్రాలు సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని పేర్కొన్నారు. షావుకారు జానకి మరణంతో సినీ రంగం ఒక గొప్ప కళాకారిణిని కోల్పోయిందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని, క్రమశిక్షణ, కృషి, అంకితభావానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. ఆమె నటన భవిష్యత్ తరాల కళాకారులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా షావుకారు జానకి ఆత్మకు శాంతి చేకూరాలని ముఖ్యమంత్రి ప్రార్థించారు. ఆమె కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో వారికి ధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని కోరుకున్నారు. తెలుగు సినీ రంగ చరిత్రలో షావుకారు జానకి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని చంద్రబాబు పేర్కొన్నారు. ఆమె కళా ప్రస్థానం, ప్రేక్షకుల హృదయాల్లో సంపాదించుకున్న స్థానం ఎప్పటికీ చెరగని వని అన్నారు. ఆమె మరణం సినీ పరిశ్రమతో పాటు కళాభిమానులందరికీ బాధాకర సంఘటనగా నిలిచిందని వ్యాఖ్యానించారు.

## పెల్లెట్ ఘటనపై రాహుల్ ధర్నా



పోలీసు స్టేషన్ పరిధిలోని డీసీపీ కార్యాలయంలో కొంతసేపు బైఠాయించారు. పెల్లెట్ గాయాలకు గురైన సాహిల్ లోచవ్ అనే యువకుడిని కూడా ఆయన వెంట తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదును స్వీకరించి కేసు నమోదు చేయాలని పోలీసులను కోరారు.సాహిల్ లోచవ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. పెల్లెట్ గన్స్ వినియోగంపై ఇప్పటివరకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా గానీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గానీ ఎటువంటి ప్రకటన చేయలేదని విమర్శించారు. ముందుగా 19 ఏళ్ల సాహిల్‌తో కలిసి రాహుల్ గాంధీ మందిర్ మార్గ్ పోలీసు స్టేషన్‌కు వెళ్లినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. అయితే అక్కడ ఫిర్యాదు స్వీకరించేందుకు నిరాకరించడంతో అనంతరం పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌కు వెళ్లినట్లు పేర్కొన్నారు.ఈ ఆందోళన కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీతో పాటు పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు. బాధితుడికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. పెల్లెట్ గాయాల ఘటనపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతున్న వేళ, ఈ అంశంపై అధికారికంగా కేసు నమోదు అవుతుందా లేదా అనే దానిపై ఆసక్తి నెలకొంది. రాహుల్ గాంధీ చేపట్టిన ధర్నాతో ఈ వ్యవహారం మరోసారి జాతీయ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.

## రాయదుర్గం భూముల వేలానికి గ్రీన్ సిగ్నల్

నిర్ణయించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. హైదరాబాద్‌లో అత్యంత విలువైన ప్రాంతాల్లో ఒకటైన రాయదుర్గంలో ఈ భూముల విక్రయం ద్వారా భారీ ఆదాయం సమకూరుతుందని ప్రభుత్వం భావిస్తోంది.అయితే ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ జువ్వాడి ప్రణయ సింహారావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. భూముల వేలం ప్రక్రియను నిలిపివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా గతంలో కంచ గచ్చిబౌలిలోని భూముల వేలాన్ని సుప్రీంకోర్టు నిలిపివేసిందని, ప్రస్తుతం ప్రభుత్వం అదే తరహా రక్షిత భూములను వేలం వేయడానికి ప్రయత్నిస్తోందని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. అందువల్ల రాయదుర్గం భూముల వేలం ప్రక్రియను కూడా నిలిపివేయాలని ధర్మాసనాన్ని కోరారు.దీనికి తెలంగాణ ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. పిటిషనర్ కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం వేలానికి ఉంచిన రాయదుర్గం పాన్ మక్తా భూములకు, గతంలో వివాదాస్పదమైన కంచ గచ్చిబౌలి భూములకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. రెండు ప్రాంతాల మధ్య దాదాపు ఐదు కిలోమీటర్ల దూరం ఉందని కూడా ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం తరఫున వినిపించిన వాదనలను పరిశీలించిన సుప్రీంకోర్టు పిటిషన్‌లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. దీంతో పిటిషన్‌ను కొట్టివేస్తూ, అవసరమైతే హైకోర్టులో న్యాయపరమైన పరిష్కారం కోరవచ్చని సూచించింది. ఈ నిర్ణయంతో రాయదుర్గం పాన్ మక్తా భూముల వేలం ప్రక్రియ కొనసాగడానికి మార్గం సుగమమైంది.

## పుణెలో డిజిటల్ బ్రిక్స్ ఫోరం నిర్వహణ




సింధియా విదేశీ ప్రతినిధి బృందాలకు స్వాగతం పలుకుతూ పుణెను ఆలోచనలు, ఆవిష్కరణలు, సాంకేతిక పురోగతికి కేంద్రంగా అభివర్ణించారు. ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధిలో భారత్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాల మధ్య భాగస్వామ్యం డిజిటల్ రంగంలో కొత్త అవకాశాలను తెరుస్తుందని ఆయన అన్నారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ స్థిరమైన డిజిటల్ వ్యవస్థల నిర్మాణంలో భారత్ సాధించిన పురోగతిని వివరించారు. దేశ అభివృద్ధి ఇకపై కేవలం రహదారులు, నౌకాశ్రయాలు, విద్యుత్ గ్రిడ్‌లకే పరిమితం కాదని, డిజిటల్ మౌలిక వసతులు కూడా అభివృద్ధికి ప్రధాన ఆధారంగా మారాయని చెప్పారు. సాంకేతిక రంగంలో భారత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు.ఫోరం సందర్భంగా స్టార్టప్ సంస్థలు, పరిశోధనా సంస్థలు తమ ఆవిష్కరణలను ప్రదర్శించాయి. డిజిటల్ సేవలు, స్మార్ట్ పరిష్కారాలు, భవిష్యత్ సాంకేతికతలపై ప్రత్యేక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పరిశ్రమలు, విద్యాసంస్థలు, ప్రభుత్వాల మధ్య సమన్వయం పెంపొందించే దిశగా ఈ వేదిక ఉపయోగపడిందని నిర్వాహకులు తెలిపారు. బ్రిక్స్ దేశాల మధ్య డిజిటల్ సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఈ ఫోరం కీలక అడుగుగా నిలిచిందని నిపుణులు అభిప్రాయపడ్డారు. సురక్షితమైన, సమగ్రతతో కూడిన డిజిటల్ భవిష్యత్తు నిర్మాణంలో పరస్పర భాగస్వామ్యం అవసరమని, సాంకేతిక రంగంలో ఉమ్మడి కార్యాచరణ ద్వారా ప్రపంచవ్యాప్తంగా కొత్త అవకాశాలు సృష్టించవచ్చని సమావేశంలో ప్రతినిధులు పేర్కొన్నారు.

## అంతరిక్ష రంగ స్టార్టప్‌లతో మోదీ భేటీ



సంవత్సరాల్లో భారత అంతరిక్ష రంగం గణనీయమైన విజయాలు సాధించిందన్నారు.ఈ సందర్భంగా వివిధ అంతరిక్ష స్టార్టప్‌లు తమ ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం, భవిష్యత్ ప్రణాళికలపై ప్రజెంటేషన్లు ఇచ్చాయి. తమ సంస్థలు అభివృద్ధి చెందడంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అంతరిక్ష సంస్కరణలు కీలక పాత్ర పోషించాయని స్టార్టప్ ప్రతినిధులు ప్రధానికి వివరించారు. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే విధానాలు కొత్త అవకాశాలను సృష్టించాయని మోదీ అన్నారు. యువత ప్రతిభ, సాంకేతిక నైపుణ్యాలు దేశాన్ని అంతరిక్ష పరిశ్రమలో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.భారత ప్రభుత్వం భవిష్యత్ సాంకేతిక సామర్థ్యాల నిర్మాణంలో స్టార్టప్‌లకు అండగా ఉంటుందని ప్రధాని స్పష్టం చేశారు. పరిశోధన, ఆవిష్కరణలు, వాణిజ్యపరమైన అవకాశాల విస్తరణలో అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రపంచానికి బలమైన, వినూత్నమైన, వాణిజ్యపరంగా విజయవంతమైన అంతరిక్ష నమూనాను అందించే సామర్థ్యం భారత్‌కు ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యువత ఆధ్వర్యంలో భారత అంతరిక్ష రంగం మరిన్ని విజయాలను నమోదు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## సాదిక్ ఖాన్ దొరికాడు!

సాదిక్ ఖాన్‌పై హత్యాప్రయత్నంతో పాటు మరో ఐదు నేరాల కింద కేసు నమోదు చేశారు. కేసు నమోదైన విషయం తెలియగానే సాదిక్ తన మొబైల్ ఫోన్‌ను వదిలేసి పరారయ్యాడు. ఇతరుల ఫోన్ల నుంచి కాల్స్ చేస్తూ రైలులో పారిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కాకినాడ జిల్లాకు చెందిన మూడు, తూర్పుగోదావరికి చెందిన రెండు పోలీసు బృందాలు అతని కోసం ముమ్మరంగా గాలిస్తున్నాయి. మృతుడు జగదీశ్వర్ రెడ్డి ఫోన్ కూడా సాదిక్ వద్దే ఉన్నట్లు సమాచారం. అకాడమీకి వచ్చే యువతులు, బాలికలనే లక్ష్యంగా చేసుకుని "ప్రత్యేక శిక్షణ" పేరుతో సాదిక్ వారిని ఒంటరిగా కలుస్తాడని, శిక్షణ సమయంలో అనుచితంగా ప్రవర్తిస్తాడని కూడా ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## దేశంలో పెరుగుతున్న స్వైన్ ఫ్లూ.. కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా సమీక్ష



**న్యూఢిల్లీ, ఆగస్టు 21** :దేశంలో స్వైన్ ఫ్లూ (H1N1) కేసులు నమోదవుతున్న నేపథ్యంలో, జాతీయ స్థాయి సన్నద్ధత, నివారణ చర్యలపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా నిరంతర నిఘా, వ్యాధి వ్యాప్తి నిరోధక చర్యలు పటిష్ఠంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు.ఢిల్లీతో పాటు ఇతర ప్రధాన ప్రాంతాల్లోని ఆసుపత్రులలో బెడ్ల లభ్యత, ఐసోలేషన్ వార్డుల ఏర్పాటుతో పాటు అవసరమైన మందులు, టీకాల లభ్యతపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, హెల్త్ సెక్రటరీలతో కూడిన బృందానికి నిరంతరం కేసులను పర్యవేక్షించాలని సూచించారు.ముఖ్యంగా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ముందస్తుగా గుర్తించడం, బాధితులకు సకాలంలో చికిత్స అందించడం.. ప్రజల్లో పరిశుభ్రత, అవగాహన పెంపొందించడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాలు, మారుమూల జిల్లాల్లో కూడా అవసరమైన ఫ్లూ నిరోధక మందుల కొరత లేకుండా చూడాలని అన్ని రాష్ట్రాల ఆరోగ్య శాఖలను కోరారు.

# హైదరాబాద్‌లో జగన్ పర్యటన

**ఐపీఎస్ అధికారి కుమారుడి వివాహానికి హాజరు**
**నూతన వధూవరులకు ఆశీస్సులు**
**పార్టీ నేతలతో కలిసి వేడుకల్లో పాల్గొన్న జగన్**





**రాజధాని వాయిస్‌హైదరాబాద్, ఆగస్టు 21 :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో పర్యటించారు. సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు కుమారుడి వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ పర్యటన ముందుగానే ఖరారైనట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. హైదరాబాద్‌లోని జలవిహార్ గ్రాండ్ లాన్స్‌లో నిర్వహించిన వివాహ కార్యక్రమంలో జగన్ పాల్గొన్నారు. వివాహ వేడుకకు హాజరైన ఆయన వధూవరులు స్నిగ్ధ, అనంత పినాక్ శర్మలకు శుభాకాంక్షలు తెలియజేసి వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వివాహ వేడుకకు వచ్చిన పలువురు ప్రముఖులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో జగన్ ముచ్చటించారు. కుటుంబ సభ్యులను అభినందిస్తూ నూతన దంపతులకు తన ఆశీస్సులు అందజేశారు. పార్టీ నాయకులు, అభిమానులు కూడా పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు. జగన్ రాకతో వేడుక ప్రాంగణంలో సందడి నెలకొంది. వివాహ కార్యక్రమం అనంతరం ఆయన కొంతసేపు అక్కడే గడిపినట్లు సమాచారం. హైదరాబాద్ పర్యటన పూర్తయిన తర్వాత జగన్ తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ పర్యటన పూర్తిగా వ్యక్తిగత కార్యక్రమానికి సంబంధించినదేనని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు కుటుంబంలో జరిగిన ఈ వివాహ వేడుకకు రాజకీయ, పరిపాలనా రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

# వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలు తెలిపిన అనిత





**రాజధాని వాయిస్ అమరావతి, ఆగస్టు 21 :** వరలక్ష్మీ వ్రత పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు, మహిళామూర్తులందరికీ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ప్రతి ఇంటా ఆనందాలు, ఐశ్వర్యాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. సారిపల్లిపాలెంలోని తన నివాసం లో వరలక్ష్మీ అమ్మవారి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు అనిత తెలిపారు. సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రతి కుటుంబంలో సిరిసంపదలు వెల్లివిరియాలని, ప్రజల జీవితాల్లో సుఖశాంతులు నెలకొనాలని ఆమె కోరుకున్నారు. మహిళలందరికీ ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం కలగాలని ప్రార్థించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, ప్రజలు సుభిక్షంగా జీవించాలని వరలక్ష్మీ అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమానంగా సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందాలని ఆకాంక్షించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో వరలక్ష్మీ వ్రతానికి ప్రత్యేక స్థానం ఉందని అనిత పేర్కొన్నారు. కుటుంబ శ్రేయస్సు, ఐశ్వర్యం కోసం మహిళలు ఎంతో భక్తితో ఈ వ్రతాన్ని ఆచరిస్తారని తెలిపారు. ఈ పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం, ఆనందం చేకూరాలని మరోసారి శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారి ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

# స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర విజయవంతానికి కృషి

**ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సమీక్ష**
**స్థానిక నాయకులతో మంత్రి సమావేశం**
**సభా ప్రాంగణాలను పరిశీలించిన బృందం**





**రాజధాని వాయిస్ అనకాపల్లి, ఆగస్టు 21 :** రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గంలోని కె.కోటపాడు మండలంలో నిర్వహించనున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఏర్పాట్లను సమీక్షించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలతో మంత్రి సమన్వయ సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లు, ప్రజల భాగస్వామ్యం, కార్యక్రమ నిర్వహణపై చర్చించారు. ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేసి కార్యక్రమ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి రాకపోకలకు సంబంధించి భద్రతా ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అవసరమైన అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే కేడర్ సమావేశం నిర్వహించనున్న ప్రాంగణం, ప్రధాన సభా వేదికను కూడా పరిశీలించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున తాగునీరు, పార్కింగ్, రవాణా, ఇతర సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా పరిశీలకుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, జిల్లా పార్టీ అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు, స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, కార్పొరేషన్ ఛైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సూచనలు చేశారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం రాష్ట్ర అభివృద్ధి, పరిశుభ్రత లక్ష్యాలకు ప్రతీకగా నిలుస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పాల్గొనే ఈ కార్యక్రమం విజయ వంతం అయ్యేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ కార్యక్రమాలను మరింత విస్తృతంగా తీసుకెళ్లడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు.

# షావుకారు జానకి మృతిపై జగన్ సంతాపం

**రాజధాని వాయిస్ తాడేపల్లి,:** ప్రముఖ సీనియర్ నటి, పద్మశ్రీ పురస్కార గ్రహీత షావుకారు జానకి మృతిపట్ల మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆమె మరణం తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటని పేర్కొంటూ, భారతీయ చలనచిత్ర రంగం ఒక గొప్ప నటిని కోల్పోయిందని అన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. షావుకారు జానకి ఏడు దశాబ్దాలకు పైగా సాగిన తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో 400కు పైగా చిత్రాల్లో నటించి ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని జగన్ కొనియాడారు. తన సహజ నటన, విభిన్న పాత్రల పోషణతో తరతరాల ప్రేక్షకులను అలరించారని గుర్తు చేశారు. దక్షిణ భారత సినీ చరిత్రలో ఆమెకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎంజీఆర్, శివాజీ గణేశన్ వంటి దిగ్గజ నటుల సరసన కథానాయికగా నటించిన షావుకారు జానకి, అనంతరం తల్లి, అమ్మమ్మ, నానమ్మ పాత్రల్లోనూ అసాధారణ ప్రతిభ కనబరిచారని జగన్ పేర్కొన్నారు. ప్రతి పాత్రలో సహజత్వాన్ని ప్రదర్శిస్తూ ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారని అన్నారు. ఆమె నటనకు ఎన్నో తరాలు అభిమానులుగా నిలిచాయని చెప్పారు. భారతీయ చలనచిత్ర రంగానికి ఆమె అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించిందని జగన్ గుర్తు చేశారు. నంది అవార్డులతో పాటు అనేక జాతీయ, రాష్ట్ర స్థాయి పురస్కారాలు ఆమె ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. సినీ రంగంలో ఆమె సాధించిన విజయాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. తెలుగు సినీ పరిశ్రమ అభివృద్ధిలో షావుకారు జానకి చేసిన సేవలు చిరస్మరణీయమని జగన్ అభిప్రాయపడ్డారు.

# విజయవాడలో ప్రత్యేక పూజలు నిర్వహణ

- కొలుసు పార్థసారథి దంపతుల భక్తి కార్యక్రమం
- రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు
- వరలక్ష్మీ వేళ ఆలయంలో సందడి





**రాజధాని వాయిస్ విజయవాడ :** రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసా రథి విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గమ్మ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన సతీమణి కమల లక్ష్మితో కలిసి ఆలయానికి చేరుకున్న మంత్రి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు చేశారు. విజయవాడకు ఆధ్యాత్మిక చిహ్నంగా నిలిచిన ఈ దేవాలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడం విశేషంగా నిలిచింది. కనకదుర్గమ్మ ఆలయం రాష్ట్రంలో ప్రముఖ శక్తిపీఠంగా ప్రసిద్ధి చెందింది. ఆలయానికి చేరుకున్న మంత్రి దంపతులకు దేవస్థాన అధికారులు, అర్చకులు సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. అనంతరం వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో కొంతసేపు గడిపిన మంత్రి రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. భక్తులతో కలిసి దర్శనం చేసుకోవడంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో ఆనందం, ఐశ్వర్యం నెలకొనాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు దైవ ఆశీస్సులు అవసరమని అన్నారు. వరలక్ష్మీ వ్రత పర్వదినాల సందర్భంగా ఆలయానికి భక్తుల రద్దీ అధికంగా కనిపించింది. ప్రత్యేక దర్శనాలు, పూజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్రంలో ని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. శ్రావణ మాసంలో కనకదుర్గమ్మ ఆలయంలో జరిగే ప్రత్యేక కార్యక్రమాలకు విశేష ప్రాధాన్యం ఉంది. దేవస్థానంలో నిర్వహించిన పూజల అనంతరం మంత్రి దంపతులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు వారికి ఆశీర్వచనాలు అందించి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, భక్తులకు అందుతున్న సౌకర్యాలపై కూడా అధికారులు మంత్రికి వివరించారు. రాష్ట్ర ప్రజల శాంతి, సౌభాగ్యం, సమృద్ధి కోసం ప్రార్థనలు చేస్తూ మంత్రి పార్థసారథి నిర్వహించిన ఈ ఆలయ దర్శనం భక్తుల్లో ఆసక్తిని రేకెత్తించింది. ప్రజా జీవనంలో ఆధ్యాత్మిక విలువలు ముఖ్యమని, సంప్రదా యాలను పరిరక్షిస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పలువురు భక్తులు అభిప్రాయపడ్డారు. ఆలయ దర్శనంతో మంత్రి తన ఆధ్యాత్మిక అనుబంధాన్ని మరోసారి చాటుకున్నారని స్థానికులు పేర్కొన్నారు.

# అన్నవరం స్వామిని దర్శించిన మంత్రి

**శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు**
**కొల్లు రవీంద్రకు వేద ఆశీర్వచనాలు**
**రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు**
**ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తుల సందడి**





**రాజధాని వాయిస్** అన్నవరం, ఆగస్టు 21 : రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర శ్రావణ శుక్రవారం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా అన్నవరంలోని శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానాన్ని సందర్శించారు. ఆలయానికి చేరుకున్న మంత్రి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసంలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలకు విశేష ప్రాధాన్యం ఉండటంతో ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది. ఆలయ అధికారులు, అర్చకులు మంత్రికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక అర్చనలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. పూజా కార్యక్రమాలు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ స్వామివారి కృపాకటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఐశ్వర్యం నెలకొనాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర పురోగతి కోసం స్వామివారి ఆశీస్సులు కోరినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు మంత్రికి ఆశీర్వచనాలు అందించారు. శాస్త్రోక్త పద్ధతిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు. స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించిన మంత్రి కొంతసేపు ఆలయ పరిసరాల్లో గడిపారు. శ్రావణ మాసం సందర్భంగా అన్నవరం దేవస్థానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శన సౌకర్యాలు, ప్రసాదాల పంపిణీ, భద్రతా ఏర్పాట్లను పటిష్ఠం చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆధ్యాత్మిక సంప్రదాయాలను కాపాడుతూ ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా పలువురు భక్తులు అభిప్రాయపడ్డారు. శ్రావణ శుక్రవారం వేళ స్వామివారి దర్శనం చేసుకున్న మంత్రి కొల్లు రవీంద్ర రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం చేసిన ప్రార్థనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# కూటమి పాలనపై కాకాణి పూజిత విమర్శలు

**- మనుబోలులో వైఎస్సార్‌సీపీ నేత పర్యటన - ప్రజాస్వామ్యం దెబ్బతింటోందని ఆరోపణ**
**- రోడ్లు, డ్రైనేజ సమస్యలపై ఆందోళన - జగన్ నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం**



**రాజధాని వాయిస్ నెల్లూరు:** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మనుబోలు మండలం అక్కంపేట గ్రామంలో పర్యటించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం దెబ్బతింటోందని, ప్రభుత్వ వ్యవస్థలు స్వతంత్రంగా పనిచేసే పరిస్థితి లేదని ఆమె ఆరోపించారు. అన్యాయాలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై నోటీసులు జారీ చేయడం, అక్రమ కేసులు నమోదు చేయడం ద్వారా వేధింపులకు పాల్పడుతున్నారని కాకాణి పూజిత పేర్కొన్నారు. అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు పెరిగాయని, పోలీసు వ్యవస్థ సహా పలు రాజ్యాంగ సంస్థలు స్వేచ్ఛగా వ్యవహరించలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. పార్టీ శ్రేణులు మనోధైర్యంతో పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. సర్వేపల్లి నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి అత్యంత దారుణంగా మారిందని ఆమె ఆరోపించారు. ప్రజలు ప్రయాణించడానికి కూడా భయపడే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఇప్పటికే బాగున్న రోడ్లను కూడా తవ్వి కాంట్రాక్టుల పేరుతో నిధులు దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరుగుతోందని, ఎక్కడికి వెళ్లినా రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆమె అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బంది పెట్టడంపై చూపుతున్న శ్రద్ధలో కొంతైనా ప్రజా సమస్యల పరిష్కారంపై చూపితే పరిస్థితులు మెరుగయ్యేవని వ్యాఖ్యానించారు. ప్రజలు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనను గుర్తు చేసుకుంటున్నారని, తిరిగి ఆయన నాయకత్వంలోనే రాష్ట్రంలో మంచి రోజులు వస్తాయని ప్రజలు ఆశిస్తున్నారని కాకాణి పూజిత పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులు, దేవుని దయతో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అక్కంపేట గ్రామంలో దండు అమర్నాథ్ రెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన కాకాణి పూజిత, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా వీర్ల అంకాలమ్మ తల్లి బోనాలు పండగ





**కారంపూడి.ఆగస్టు 21రాజధాని వాయిస్ :** పట్టణంలోని గ్రామ దేవత అయిన శ్రీ వీర్ల అంకాలమ్మ తల్లికి భక్తులు శ్రావణమాసం రెండవ వారం సందర్భంగా శుక్రవారం బ్రాహ్మణులు,ఆర్యవైశ్యులు, కాపులు ఘనంగా అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం కుంకుమ బండ్ల పూలతో అలంకరించారు. కుంకం బండ్లు ప్రజలను ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో భక్తులు మండల ప్రజలు పాల్గొన్నారు.

## మాచర్ల యువతకు శుభవార్త ఉచిత కంప్యూటర్ శిక్షణ



**మాచర్ల.ఆగస్టు 21 రాజధాని వాయిస్ :** ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మాచర్లలోని ఎస్.కె.బి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్కిల్ హబ్లో ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కే. భరత్ కుమార్ నాయక్ మాట్లాడుతూ, యువత ఈ అవకాశాన్ని సద్వినియో గం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ అటెండెంట్ కోర్సు లో భాగంగా కంప్యూటర్ బేసిక్స్, ఎంఎస్ ఆఫీస్, గూగుల్ షీట్స్, ఏఐ టూల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ ఆగస్టు 26 నుంచి రెండు నెలల పాటు కొనసాగుతుందని పేర్కొన్నారు. శిక్షణతో పాటు సర్టిఫికేషన్ కూడా పూర్తిగా ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు.16 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న యువత ఈ అవకాశాన్ని వినియో గించుకుని కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు ఉద్యోగావకాశాలకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ కిరణ్ నాయక్ - 7842747682 నంబర్ ను సంప్రదించాలని సూచించారు.

## భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



**గుంటూరు ఆగస్టు 21 రాజధాని వాయిస్ :** శ్రావణ మాస రెండవ శుక్రవారాన్ని పురస్కరించుకొని నగరంలోని పలు ఆలయాలలో, గృహాలలో వరలక్ష్మీ వ్రతాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాలలో మూలవిరాట్లకు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు అలంకరణ జరిగాయి. గృహాలలో అమ్మవారి రూపును తయారు చేసుకుని ప్రత్యేక పూజలు,అలంకరణ నిర్వహించారు. ముత్తైదువులకు వాయినాలు ఇచ్చి వారి ఆశీస్సులు అందుకున్నారు. స్థానిక బృందావన్ గార్డెన్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దాదాపు 500 మంది సువాసినిలు వరలక్ష్మీ వ్రతంలో పాల్గొని వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. స్థానిక అరండల్ పేట శ్రీ అష్టలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆలయ నిర్వహకులు మర్రిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో దాదాపు 100 మంది సువాసినీలు వరలక్ష్మీ వ్రతం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక మారుతీ నగర్ మారుతీ దేవాలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో 200 మంది ముత్తైదువులు వరలక్ష్మి వ్రతాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక విద్యానగర్ శ్రీ కనకమహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో ఆలయ వ్యవస్థాపకులు ఘంటసాల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో దాదాపు 100 మంది ముత్తైదువులు వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహి ంచారు. స్థానిక మల్లారెడ్డి నగర్ అయ్యప్ప స్వామి ఆలయ ప్రాం గణంలో ఆలయ కమిటీ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 100మంది వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

# వైసిపి పబ్లిసిటీ వింగ్ వైఎస్ ప్రెసిడెంట్‌గా మిట్టా జంగ మయ్య నియామకం






**పిడుగురాళ్ల.ఆగస్టు 21, రాజధాని వాయిస్ :** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకుగురజాల నియోజవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఆశీస్సులతో వైసిపి పల్నాడు జిల్లా పబ్లిసిటీ వింగ్ ఉపాధ్యక్షుడిగా పిడుగురాళ్ల మండలం, చెన్నయ్యపాలెం గ్రామానికి చెందిన మిట్టా జంగమయ్య యాదవ్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా జంగమయ్య మాట్లాడుతూ, బిసి సామాజిక వర్గంపై తనకున్న అభిమానాన్ని మాటలు రూపంలో కాకుండా పదవులు ఇచ్చి తన అభిమానాన్ని చూపించిన కాసు మహేష్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.పార్టీ జిల్లాఅధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి నాయకత్వంలో జిల్లాలో పార్టీ పూర్వవైభవాన్ని తీసుకురావడానికి నావంతు ప్రయత్నం చేస్తానని,పార్టీ అప్పగించిన ఈ పదవిని ఒక బాధ్యతగా తీసుకోని పనిచేస్తానని,వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయ పథం తధ్యమని,సిఎంగా జగన్ మరోసారి అఖండ మెజారిటీతో గెలిపించటానికి ఏపి ప్రజలు సిద్దంగా ఉన్నారని, అన్నీ వర్గాల ప్రజలకు సమన్యాయం వైకాపా లోనే సాధ్యం అన్నారు.జిల్లా పార్టీ పబ్లిసిటి వింగ్ వైఎస్ ప్రెసిడెంట్ గా జంగమయ్య నియమితులైన సందర్భంగా వైసిపి నాయకులు,కార్యకర్తలు,బిసి నాయకులు మిట్టాను కలిసి ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

## శ్రీ వీర్ల అంకాలమ్మ తల్లికి ప్రత్యేక చేసిన జూలకంటి గౌతమ్ రెడ్డి





**కారంపూడి.ఆగస్టు 21రాజధాని వాయిస్ :**మండలం కేంద్రంలో కొలువుదీరిన శ్రీ అంకాలమ్మ తల్లి దేవస్థానంలో శ్రావణ మాసం పర్వదినాలను పురష్కరించుకుని నిర్వహిస్తున్న అమ్మవారి బోనాలు అంగరంగ వైభవంగా జరిగాయి. శుక్రవారం పూజా కార్యక్రమాల్లో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయుడు, టీడీపీ యువ నాయకుడు గౌతమ్ జూలకంటి పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు కట్టిన కుంకుమ బండ్లను ప్రారంభించి, పురవీధుల్లో కుంకుమ బండి టాక్టర్ ను నడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పల్నాడు ప్రజల ఆరాధ్యదైవం అంకాలమ్మ తల్లి చల్లని దయ అందరిపై ఉండి, పాడి పంటలు సుభిక్షంగా ఉండేలా దీవించాలని మొక్కుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పంగులూరి అంజయ్య, ఎంపీపీ బొల్నేడి శ్రీనివాసరావు, పంగులూరి పుల్లయ్య, చప్పిడి రాము, పార్టీ మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్, బాలకృష్ణ, మస్తాన్ జానీ, పార్టీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరిరావు, సంగినేడి బాలకృష్ణ, హరి తదతరులు పాల్గొన్నారు.

## మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదగా అత్యుత్తమ పురస్కార అవార్డును అందుకున్న డాక్టర్ కె పి చారి..




**మాచర్ల.ఆగస్టు 21 రాజధాని వాయిస్ :**80వ స్వాతంత్ర దినోత్సవ, సందర్భంగా జిల్లాలో ఉత్తమ సేవలు అందించినందుకు రాష్ట్ర ప్రభుత్వం, ప్రతి సంవత్సరం కొందరిని ఎంపిక చేసి, వారిని సత్కరించి అవార్డును ప్రధానం చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ,మంత్రి నాదెండ్ల మనోహర్ నాయుడు,పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరా యలు, జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల,చేతుల మీదగా మాచర్ల పట్టణంలోని, ప్రభుత్వ ఆసుపత్రి విభాగంలో సూపర్నడెంట్ గావిధులు నిర్వహిస్తూ, తన వృత్తికే వన్నె తెచ్చే విధంగా ఎంతోమంది పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలను అందిస్తూ, రోగులను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ ఆసుపత్రిని కార్పొరేట్ స్థాయి ఆసుపత్రిగా పరిశుభ్రతలో ప్రథమ పౌరుడిగా నిరంతర పర్యవేక్షణలో సిబ్బందికి తోడుగా డాక్టర్ అని పిలిస్తే పలికే ఒక వైద్యునిగా పేరు తెచ్చుకున్న డాక్టర్ కే పి చారి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాకు ఈ అవార్డును ప్రధానం చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి మొదటగా కృతజ్ఞతలు తెలుపుతూ. కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి అని నాటి అబ్దుల్ కలాం, మాటలతో స్ఫూర్తిని నింపుకొని సరైన వైద్యం చేయించుకోలేని పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని,బాల్యం నుంచే ఒక కల నాలో మెదులుతూ దానికి తగిన కఠోర శ్రమను చేసి వైద్య కోర్సులు అభ్యసించి అనంతరం పలనాడు ప్రజలకు సేవ చేసే భాగ్యం నాకు లభించింది అని వారు సంతోషాన్ని వ్యక్తపరిచారు. అనంతరం హాస్పిటల్ సిబ్బంది మరియు పట్టణంలోని స్థానికులు డాక్టర్ కు శుభాకాంక్షలు తెలిపారు.

# కండ్లకుంటలో పోలీసుల కార్డన్ సెర్చ్

### 29 ద్విచక్ర వాహనాలు, ఆయుధాలు స్వాధీనం

**వెల్దుర్తి .ఆగస్టు 21 రాజధాని వాయిస్ :**స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ముందస్తు చర్యలు ముమ్మరం చేశారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం కండ్లకుంట గ్రామంలో మాచర్ల రూరల్ సీఐ వేణు ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా 29 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, రెండు గొడ్డళ్లు, ఒక గడ్డపలుగు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తనిఖీల్లో వెల్దుర్తి ఎస్సై సత్యనారాయణ, మాచర్ల రూరల్ ఎస్సై వెంకట్రావు, కారంపూడి ఎస్సై వాసుతో పాటు సుమారు 30 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నామని రూరల్ సీఐ వేణు తెలిపారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేస్తామని, ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు.వాహనదారులు తప్పనిసరిగా సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, వాహనాలకు ఇన్సూరెన్స్ ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని కోరారు.యువత డ్రగ్స్, మాదకద్రవ్యాలకు, సోషల్ మీడియా ప్రభావానికి లోనై పెడదారి పట్టకుండా తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఐ సూచించారు. డ్రగ్స్ వినియోగం లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మాదకద్రవ్యాల విక్రయం, వినియోగానికి పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుల నిఘా, ముందస్తు భద్రతా చర్యలు నిరంతరం కొనసాగుతాయని సీఐ వేణు స్పష్టం చేశారు.



## 22 23 29 30 తేదీలలోఎస్ ఐ ఆర్ ప్రత్యేక ప్రచార దినాలు



**గురజాల,ఆగస్టు 21 రాజధాని వాయిస్ :** గురజాల నియో జకవ ర్గం ఆగస్టు 22, 23, 29, 30 తేదీలను ఎస్ ఐ ఆర్ ప్రత్యేక ప్రచార దినాలుగా ఎన్నికల కమిషనర్ ప్రకటించి నట్లు ఎల క్లోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, గురజాల రెవిన్యూ డివిజనల్ అధికారివి మురళీ కృష్ణ శుక్రవారం తెలియజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ప్రచార దినాల్లో సంబంధిత బూతు స్థాయి అధికారులు బిఎల్వోలు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి వివరాలు, అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు తదితర అంశాలపై ఓటర్లకు అవసరమైన సమాచారం అందించడం తోపాటు వారి సందేహాలను నివృత్తి చేయాలని బిఎల్ఓ లకు వి మురళీకృష్ణ సూచించారు. ప్రత్యేక ప్రచార దినాలను ఓటరు సద్వినియోగం చేసుకొని ఓట్ల జాబితాలో తమ పేర్లు వివరాలను పరిష్కరించు కోవాలని ఎల క్లోరల్ రిజిస్ట్రేషన్ అధికారి,ఆర్డిఓ వి మురళీకృష్ణ కోరారు.

## గంగవరం గ్రామంలోని అక్షయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సతీష్ పుట్టినరోజు వేడుకలు




**గురజాల, ఆగస్టు 21 రాజధాని వాయిస్ :**గురజాల పట్టణం లోని గంగవరం గ్రామంలో ఉన్నటువంటి అక్షయ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలోశుక్రవారం తెలుగుదేశం యువ నాయకులు ఏచూరిసతీష్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలో వృద్ధుల నడుమ కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించి తదుపరి వృద్ధులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో జానకిరామ్ గూడూరి, మాచర్ల నాగేశ్వరరావు, బొజ్జ గణేష్, పయ్యావుల బాబుతో పాటుగా ఆశ్రమ నిర్వాహకురాలు గుండాల మల్లేశ్వరి, ఆశ్రమంలోని వృద్ధులు పాల్గొన్నారు.

## పల్నాడు జూనియర్ కాలేజిలో ఘనంగా శ్రావణమాస వరలక్ష్మీ వ్రతం



**మాచర్ల ఆగస్టు 21 రాజధాని వాయిస్ :** శ్రావణ మాస వరలక్ష్మి వ్రత దినోత్సవాన్ని శుక్రవారం పట్టణంలోని పల్నాడు జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల లోని విద్యార్థిని విద్యార్థులందరూ భక్తిశ్రద్ధలతో, కులమతాలకు అతీతంగా లక్ష్మీదేవి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తి పాటలతో, శ్లోకాలాపన చేస్తూ సాగిన కార్యక్రమం ఎంతో ఉత్సాహభరితంగా జరిగింది. కళాశాలలోని విద్యార్థిని విద్యార్థులకు ఐకమత్య భావన,మంచి భక్తి భావాలను, ఆధ్యాత్మిక చింతనతో మనోభావాలను పెంపొందించుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పఠాన్ నాగూర్ వలి, ప్రిన్సిపాల్ నూతలపాటి శివ భాస్కర్ తెలిపారు. కళాశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు ,విద్యార్థినీ విద్యార్థులకు , వారి కుటుంబ సభ్యులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాధాకుమారి, మధురవాణి, మేరీ రాణి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సై నాగరాజు సన్మానించిన తెలుగు మహిళలు



**పిడుగురాళ్ల ఆగస్టు 21 రాజధాని వాయిస్ :**స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న పిడుగురాళ్ల ఎస్ఐ శివ నాగరాజును పట్టణంలోని పోలీస్ స్టేషన్లో శుక్రవారం కూటమి మహిళలు, తాళ నిర్మల, రాతల రమణ బాయ్, చల్ల అంజమ్మ, కుమ్ము మేరీ దుశ్శాలువలతో ఘనంగా ఘనంగా సత్కరించి అభినందించారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com